సాక్షి తిరుపతి

ఆదివారం ၊ 13 ၊ ఆగస్టు ၊ 2023



అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్ట్

అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఐదుగురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను సూళ్లూరుపేట పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. - 8లో



యువతతోనే సమాజంలో సుస్థిరత

యువత బాధ్యతతో ముందుకు సాగితే సమాజంలో సుస్థిరత ఏర్పడుతుందని సెట్విన్ సీఈఓ తెలిపారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	26
చిత్తూరు	36	25
తిరుమల	32	22
గూడూరు	37	28
నగరి	37	27

న్యూస్‌రీల్

బిందుసేద్యంపై ఊరూరా అవగాహన



మాట్లాడుతున్న హరినాథ్‌రెడ్డి

తిరుపతి అర్బన్: బిందు సేద్యంపై ఊరూరా అవగాహన కల్పించాలని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిసాగు పథకం ప్రాజెక్టు ఆఫీసర్ హరినాథ్ రెడ్డి సూచించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లో ఏరియా కో-ఆర్డినేటర్లు, డీసీఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బిందు సేద్యాన్ని పెంపొందించడానికి, రైతులకు అండగా నిలవడానికి పెద్ద ఎత్తున రాయితీ పరికారాలు పంపిణీ చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ సమాచారాన్ని ఊరూరా రైతులకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. మార్చి 31వ తేదీలోపు వంద శాతం బిందు సేద్యం పరికరాలను పంపిణీ చేయాలని చెప్పారు.

పోస్టాఫీసుల్లో రూ.25కే జాతీయ జెండా



జాఫర్ సాధిక్

తిరుపతి అర్బన్: పంద్రాగస్టు సందర్భంగా జిల్లాలోని పోస్టల్ కార్యాలయాల్లో రూ.25కే జాతీయ జెండాను పంపిణీ చేయడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు జిల్లా పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ జాఫర్ సాదిక్ శనివారం తెలిపారు. ఆదివారం సైతం పోస్టల్ కార్యాలయాల్లోని కొంటర్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. పెద్ద మొత్తంలో జాతీయ జెండాలు అవసరముంటే విజయవాడకు చెందిన చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ కే.సుధీర్‌బాబును సంప్రదించాలని సూచించారు. వివరాలకు 520013, 8897302739లో సంప్రదించాలని కోరారు.

వృత్తి నైపుణ్యాలు పెంపొందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న సీమాట్ డైరెక్టర్ మస్తానయ్య

రామచంద్రాపురం: ప్రధానోపాధ్యాయుల్లో వృత్తి నైపుణ్యాలు పెంపొందించడమే లక్ష్యమని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ (సీమాట్) డైరెక్టర్ మస్తానయ్య తెలిపారు. ఆయన శనివారం సీరామాపురం వద్ద ఉన్న వెరిటాస్ సైనిక్ స్కూల్‌లో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల ప్రధానోపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 44,480 ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. మొదటి బ్యాచ్‌లో విశాఖపట్నం, కాకినాడ, బాపట్ల, ఏలూరు, తిరుపతి, అనంతపురం శిక్షణా కేంద్రాలలో 1,450 మందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని పాఠశాలలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర పరిశీలకులు శారద, సాయిక్రిష్ణ, డీఈఓ శేఖర్, ఉప విద్యాశాఖాధికారి ఆనందరెడ్డి, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకర్, అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ మధు, ఎంఈఓ భాస్కర్‌బాబు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 23 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 72,158 మంది స్వామివారిని దర్శించుకోగా.. 30,735 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.08 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టోక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.

మేమేమి చేశాము పాపం?



రోదిస్తున్న కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్) మృతురాలు లక్షిత ఫైల్

బుడిబుడి అడుగులు వేస్తూ.. కేరింతలు కొడుతూ.. అందర్నీ దాటుకుంటూ.. ఒక్కో మెట్టూ ఎక్కుతున్న కుమార్తెను చూసి ఉప్పొంగిపోయారు. ఆ గోవిందుడిని స్మరిస్తూ.. ముందు వెళ్తున్న కుమార్తెను గమనిస్తూ.. ముందుకు సాగారు. ఇంతలో బాలిక హఠాత్తుగా అదృశ్యమవడంతో తల్లిదండ్రులు ఒకింత గందరగోళానికి లోనయ్యారు. ఎక్కడుందోనన్న ఆత్రుతతో చీకటిని చీల్చుకుంటూ వెతుకులాడడం ప్రారంభించారు. నిశీధిలో రెప్ప వాల్చకుండా ఎక్కడో ఒకచోట సురక్షితంగా ఉంటుందని ఎదురుచూశారు. కానీ వారి ఆశలు అడియాశలయ్యాయి. వన్యజంతువు దాడిలో చిన్నారి మృతిచెందిందని తెలిసి ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. మా ఇంటి మహాలక్ష్మిని తీసుకెళ్లావా..దేవుడా! అంటూ గుండెలవిసేలా రోదించారు. అక్క ఎక్కడుందమ్మా..? అంటూ తమ్ముడు అడిగే మాటలకు ఆ తల్లి జవాబు చెప్పలేక కన్నీరు మున్నీరవుతూ విలపించడం అక్కడి వారిని కలిచివేసింది. ఈ విషాద ఘటన రుయా ఆస్పత్రి వద్ద శనివారం కనిపించింది.

- వన్యమృగం దాడిలో బాలిక మృతి!
- తిరుమల అలిపిరి నడక మార్గంలో ఘటన
- తల్లిదండ్రుల రోదనలతో దద్దరిల్లిన రుయా
- దాడి చేసింది చిరుతేనా?

సాక్షి, తిరుపతి/తిరుపతి తుడా: తిరుమల అలిపిరి నడక మార్గంలో శుక్రవారం రాత్రి ఘోరం చోటుచేసుకుంది. వన్యమృగం దాడిలో ఆరేళ్ల బాలిక మృతి చెందడం అందరినీ కలిచివేసింది. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, కోవూరు మండలం, పోతిరెడ్డిపాళెంకు చెందిన దినేష్‌కుమార్, శశికళ కుమార్తె లక్షిత(6) శుక్రవారం సాయంత్రం అలిపిరి కాలిబాటలో కనిపించకుండా పోయింది. తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, ఫారెస్ట్ సిబ్బంది జల్లెడ పట్టారు. శనివారం తెల్లవారుజాము నుంచి మరోమారు గాలింపు చేపట్టగా.. అలిపిరి నడకమార్గంలోని నరసింహస్వామి ఆలయానికి వంద నుంచి 200 మీటర్ల దూరంలో ఓ బండరాయిపై లక్షిత మృతదేహం లభ్యమైంది.

క్రూరం..ఘోరం

చిన్నారి లక్షితను వన్యజంతువు అతికిరాతకంగా హతమార్చినట్టు తెలుస్తోంది. మెడ, తల భాగాన్ని.. కుడికాలు తొడ భాగంలోని కండను పూర్తిగా తినేయడంతో భయానకంగా మారింది. చిన్నారి మృతదేహాన్ని ఉదయం 7.55 గంటలకు తిరుపతి రుయా ఆస్పత్రి తీసుకొచ్చారు. 15 నిమిషాల పాటు డాక్టర్లు పరిశీలించి శవపరీక్ష కోసం మార్చురీకి తరలించారు. ఎస్వీ మెడికల్ కళాశాల ఫోరెన్సిక్ విభాగ వైద్యుల బృందం పోస్టుమార్టం నిర్వహించింది. ఉదయం 11.05 గంటలకు పోస్టుమార్టం పూర్తిచేసి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. మృతదేహాన్ని స్వస్థలానికి తరలించేందుకు టీటీడీ అంబులెన్స్ సిద్ధం చేసింది.

కొంప ముంచిన బెలూన్!

సీసీ ఫుటేజ్ పరిశీలించిన అధికారులు చిన్నారి హుందాగా.. వేగంగా ఆడుకుంటూ తల్లిదండ్రులకంటే ముందే మెట్లెక్కడం కనిపించింది. ఈ క్రమంలో ఆంజనేయ స్వామి విగ్రహం తర్వాత ఓ దుకాణం వద్ద బిస్కెట్ ప్యాకెట్‌ను కొనిచ్చారు. వాటిని తింటూ చిన్నారి ముందుకు సాగింది. నరసింహస్వామి ఆలయ సమీపంలో చిన్నారి కనిపించకుండా పోయింది. బెలూన్‌తో ఆడుకుంటున్న సమయంలో గాలికి ఆ బెలూన్ మెట్లమార్గం దాటి వెళ్లడం.. దానికోసం పరుగులు తీసే క్రమంలో ఆ పరిసర ప్రాంతాల్లో చెట్ల మాటున దాగి ఉన్న క్రూరమృగం పాపను ఎత్తుకెళ్లి ఉండొచ్చని భావిస్తున్నారు.

రుయాలో మిన్నంటిన ఆర్తనాదాలు



రుయా వార్డు నుంచి మార్చురీకి లక్షిత మృతదేహం

రుయా మార్చురీ వద్దకు చేరుకున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు చిన్నారి మృతదేహాన్ని చూసి భోరున విలపించారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న నా బిడ్డ దక్కకుండా పోయిందంటూ తల్లి శశికళ గుండెలు బాదుకుంటూ రోదించడం అక్కడి వారిని కంటతడి పెట్టించింది. చిన్నారి నానమ్మ మనుమరాలితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ దేవుడా..! ఇంత శిక్షవేశావేంటయా... అంటూ విలపించడం కలిచివేసింది. అక్క ఎక్కడమ్మా?..అంటూ తమ్ముడు లిఖిత్ అడుగుతుండడంతో తల్లి సమాధానం చెప్పలేక.. ఇంకెక్కడ అక్క నాయనా! దేవుడు తీసుకెళ్లి పోయాడురా అంటూ.. కన్నీరుమున్నీరైంది. మా ఇంటి మహాలక్ష్మి ఇక లేదన్న విషయాన్ని ఎలా జీర్ణించుకోవాలంటూ తల బాదుకుంటూ విలపించడం చూపరులను కంటతడి పెట్టించింది.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

సంఘటనా స్థలాన్ని ఎస్పీ పరమేశ్వరరెడ్డి పరిశీలించారు. బాలికను వన్యజంతువులు దారుణంగా చంపడం బాధాకరమన్నారు. భక్తులందరూ గుంపులు గుంపులుగా వెళ్లాలని సూచించారు.



అల్లాడిపోయావా తల్లీ..!

బొద్దుబొద్దుగా.. ముద్దులొలికే మాటలతో మురిపించావు. అందర్నీ పేరుపెట్టి పిలుస్తుంటే మా అమ్మవని పొంగిపోయాము. ఇంట్లోకి మహాలక్ష్మి వచ్చిందని సంబరపడ్డాము. వన్యమృగం రూపంలో మృత్యువు వస్తుందని ఊహించలేకపోయాము. నిన్ను గోళ్లతో గుచ్చుతుంటే ఎంత అల్లాడిపోయావో.. మెడపై పళ్లతో కొరుకుతుంటే ఎంత భయపడిపోయావో.. నిన్ను చూస్తుంటేనే మా కడుపు తరుక్కుపోతోంది' అంటూ కుటుంబ సభ్యులు రోదించడం అక్కడి వారి కళ్లు చెమర్చేలా చేసింది.

దాడి చేసింది చిరుతేనా?

వన్యజంతువు చిన్నారి శరీరాన్ని చిన్నాభిన్నం చేసింది. చూడడానికి వీలుకాని రీతిలో మృతదేహం పడిఉండడం.. చూస్తే చిరుతా..లేక ఎలుగుబంటా అనే విషయాన్ని అధికారులు నిర్ధారించలేకపోతున్నారు. మరికొందరు రేసుకుక్కల పనేనని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తర్వాతే ఒక నిర్ణయానికి రాగలమని అధికారులు చెబుతున్నారు. అయితే చిరుతదాడేనని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్టు తెలుస్తోంది. ఘటన స్థలాన్ని సీసీఎఫ్ నాగేశ్వరరావు, డీఎఫ్‌ఓ సతీష్‌కుమార్ పరిశీలించారు. దాడి చేసిన జంతువును బంధించేందుకు బేస్ క్యాంప్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎలుగుబంటు అయితే మత్తుద్వారా బంధిస్తామని, చిరుత అయితే బోన్ ద్వారా బంధించనున్నట్లు వెల్లడించారు. జంతువుల కదిలికలను గుర్తించేందుకు ట్రాప్ కెమెరాలతో పాటు డ్రోన్ కెమెరాలను వినియోగిస్తామన్నారు. ఏడో మైలురాయి నుంచి నరసింహస్వామి ఆలయం వరకు హైఅలర్ట్ జోన్‌గా ప్రకటించారు. ఘటనా స్థలాన్ని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పరిశీలించారు. చిన్నారి మృతి బాధాకరమని విచారం వ్యక్తం చేశారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన

పునర్జన్మనిద్దాం!



'మరణించిన వ్యక్తి జీవించవచ్చు.. మరో రూపంలో పునర్జన్మను పొందవచ్చు.. తద్వారా ఇంకో ఎనిమిది మందికి జీవితాలను ప్రసాదించవచ్చు.. ఇది కేవలం అవయవదానంతోనే సాధ్యం..' అని అంటున్నారు వైద్యులు. అపోహలు వీడి స్వచ్ఛందంగా ముందుకురావాలని పిలుపునిచ్చారు. ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

- మరణించినా జీవించవచ్చు
- అపోహలు వీడి ముందుకురావాలంటున్న వైద్యులు
- శ్రీపద్మావతీ చిన్నపిల్లల ఆస్పత్రిలో నలుగురికి గుండె మార్పిడి
- నేడు అవయవదాన దినోత్సవం

తిరుపతి తుడా : ప్రాణాలను రక్షించడంలో అవయవదానం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అవయవవైఫల్యంతో బాధపడుతున్న వారికి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తుంది. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి, సజీవంగా ఉన్న వ్యక్తి అవయవాలను దానం చేయవచ్చు. ఇందుకు కుటుంబ సభ్యుల అంగీకారం తీసుకోవాలి. అలాగే మృతి చెందిన వ్యక్తి నుంచి నాలుగు గంటల్లోపు కళ్లను సైతం దానం చేయవచ్చు. అవయవ వైకల్యంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న మరికొందరి వ్యక్తులకు వీటిని మార్పిడి చేసి పునర్జన్మను ప్రసాదించవచ్చు.

తిరుపతిలో విజయవంతంగా గుండె మార్పిడి

టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీపద్మావతీ చిల్లపిల్లల గుండె చికిత్సల ఆస్పత్రిలో వైద్యులు విజయవంతంగా గుండె మార్పిడి పూర్తిచేసి చరిత్ర తిరగరాస్తున్నారు. 2021 సెప్టెంబర్ 11వ తేదీన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా చిన్నపిల్లల ఆస్పత్రి పురుడు పోసుకుంది. అనతి కాలంలోనే సుమారు 1,500 మంది చిన్నారులకు గుండె సంబంధిత చికిత్సలను విజయవంతంగా పూర్తి చేసింది. గత ఏడాది జనవరి 20వ తేదీన తొలిసారి గుండె మార్పిడి శస్త్ర చికిత్సను పూర్తిచేశారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథరెడ్డి ఆధ్వర్యంలోని వైద్యులు 48 ఏళ్ల సన్యాసమ్మ అనే మహిళ గుండెను 15 ఏళ్ల బాలుడికి అమర్చారు. అనంతరం వరుసగా మొత్తం నలుగురు చిన్నారులకు గుండె మార్పిడి చేసి పునర్జన్మను ప్రసాదించారు.



నమోదు ఇలా..

- అవయవదానానికి ముందుకు వచ్చిన వ్యక్తులు, కుటుంబ సభ్యులు, వాటి అవసరం ఉన్న వ్యక్తులు జీవన్‌ధాన్ వెబ్‌సైట్‌లో తొలుత నమోదు చేసుకోవా.
- వెబ్‌సైట్‌లో అవసరమైన వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.
- రోగి అవసరం, తీవ్రతను బట్టి దాతల వివరాలను సంబంధిత ఆస్పత్రులకు సమాచారం అందుతుంది.

- **జీవించి ఉన్న దాతలు దానం చేయగల అవయవాలు**
  ఒక కిడ్నీ, ఒక ఊపిరితిత్తి, కాలేయంలో ఒక భాగం, ప్యాంక్రియాస్‌లో ఒక భాగం, పేగులో ఒక భాగం
- **బ్రెయిన్ డెడ్ వ్యక్తి నుంచి**
  మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తులు, గుండె, ప్యాంక్రియాసిస్, పేగులు, కళ్లు, చేతులు, ముఖభాగాలు
- **మరణించిన వ్యక్తి నుంచి**
  మరణించిన వ్యక్తి నుంచి నిర్ణీత వ్యవధిలోపు కళ్లను మాత్రమే దానం చేయవచ్చు

దాతలకోసం ఎదురుచూస్తున్న పసిప్రాణాలు

శ్రీ పద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారుల్లో 11 మందికి గుండె సామర్థ్యం పూర్తిగా క్షీణించినట్లు వైద్యులు నిర్ధారించారు. వీరికి గుండె మార్పిడి అనివార్యమని తేల్చారు. దాతలు ముందుకు వచ్చి గుండెను దానం చేస్తే పునర్జన్మను ప్రసాధించవచ్చని కోరుతున్నారు

అపోహలు వీడండి

శరీరంలోని అవయవాన్ని దానం చేస్తే దోషమని, శాస్త్రం ఒప్పుకోదని, అపోహలు ఉండడం బాధాకరం. మన దగ్గర వ్యక్తి మనకు దక్కడు అనుకున్నప్పుడు మరొకరికి అవయవాలను దానం చేయడం వల్ల మృతి చెందినా తిరిగి జీవించే అవకాశాన్ని కల్పించినవాళ్లవుతారు. బ్రెయిన్ డెడ్ అయిన ప్రతి ఒక్కరి అవయవాలను దానం చేసేందుకు చైతన్యం రావాలి.

–డాక్టర్ శ్రీనాథరెడ్డి, డైరెక్టర్, శ్రీపద్మావతి చిన్నపిల్లల గుండె చికిత్సాలయం

గొప్పగా భావించాలి

అవయవదానం గొప్పవరంగా భావించాలి. చనిపోయిన వ్యక్తి అవయవాలను స్వర్గానికి తీసుకెళ్లడు. అవి భూమి మీద మరొక్కరి ఉపయోగపడాలి. అవగాహనతో మరో వ్యక్తికి పునర్జన్మను ప్రసాదించండి. మరణించిన మీ కుటుంబ సభ్యుడిని అవయవదానంతో తిరిగి జీవించేలా చేయండి.

–డాక్టర్ శ్రీహరి, జిల్లా వైద్యశాఖాధికారి, తిరుపతి

తరించి..పులకించి!





హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సత్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఇస్తికఫాల్ స్వాగతం పలుకుతున్న ఈఓ ఏవీ ధర్మారెడ్డి

తిరుమల శ్రీవారిని శనివారం రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. – తిరుమల

సుందర తిరుమలలో భాగస్వామ్యం

పూర్వజన్మసుకృతం

తిరుపతి కల్చరల్: సుందర తిరుమల –శుద్ధ తిరుమల కార్యక్రమంలో విద్యార్థులు భాగస్వాములు కావడం పూర్వజన్మ సుకృతమని టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో భాగంగా నిర్వహిస్తున్న సుందర తిరుమల –శుద్ధ తిరుమల కార్యక్రమాన్ని శనివారం అలిపిరి టోల్ గేట్ వద్ద టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తిరుమల ఘాట్ రోడ్లు, నడక మార్గాల్లో టీటీడీ విద్యాసంస్థల్లోని సుమారు వెయ్యి మంది విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం, తిరుమలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడానికి మే 31వ తేదీ టీటీడీలోని అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు ఈ కార్యక్రమం నిర్వహించారన్నారు. ప్రతి మూడు నెలల కోసారి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఉపయోగకరమన్నారు. విద్యార్థులు రెండు ఘాట్ రోడ్లు, అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన గ్లౌజులు, మాస్కులు, ప్లాస్టిక్ బ్యాగులు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈఓ సదా భార్గవి, ఎస్వీవేద విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య రాణి సదాశివమూర్తి, ఎస్వీయూ వీసీ ఆచార్య రాజారెడ్డి, మహిళావర్సిటీ వీసీ ఆచార్య భారతి, రిజిస్ట్రార్ రజని, ఎస్ఈ –2 జగదీశ్వర్‌రెడ్డి, డీఈఓ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ సునీల్, టీటీడీ కళాశాలల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.



సుందర తిరుమల –శుద్ధ తిరుమల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి

యువతతోనే సమాజంలో సుస్థిరత



జెండా ఊపి 2కే రన్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ కాటమరాజు, సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ, డీఈఓ శేఖర్

తిరుపతి కల్చరల్: జనాభాలో 36 శాతం ఉన్న యువత మంచి లక్ష్యం, బాధ్యతతో ముందుకు సాగితే సమాజంలో సుస్థిరత, శాంతి, అభివృద్ధి ఏర్పడుతుందని సెట్విన్ సీఈఓ డాక్టర్ వీ.మురళీకృష్ణ తెలిపారు. యువజన సర్వీసుల శాఖ, ప్రభుత్వ ఆదేశాల మేరకు అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా సెట్విన్ ఆధ్వర్యంలో శనివారం అలిపిరి నుంచి అరవింద్ కంటి ఆస్పత్రి వరకు 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ 2కే రన్‌ను దిశ పోలీసు విభాగం డీఎస్పీ కాటమరాజు, డీఈఓ శేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. డీఎస్పీ మాట్లాడుతూ అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా నేటి యువత బాధ్యతగా వెలగాలన్నారు. డీఈఓ శేఖర్ మాట్లాడుతూ నేటి యువత తమ లక్ష్యాన్ని ప్రణాళికాబద్ధంగా, క్రమశిక్షణతో నేర్చుకోవాలన్నారు. 2కే రన్ పోటీలలో యువజన సంఘాలు, యూత్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు, వికాస్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. బాలురు, బాలికలు రెండు విభాగాలుగా చేపట్టిన ఈ పోటీలలో బాలుర విభాగంలో ఏ.గంగిరాజు, ఐ.వెంకటేష్, సీ.రవిబాబు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు. బాలికల విభాగంలో టీ.మయూరి, ఎన్.నాగరాణి, టీ.మౌనిక విజేతలుగా నిలిచారు. సెట్విన్ మేనేజర్ కే.మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

వైఎస్ విజయమ్మను కలిసిన టీటీడీ చైర్మన్



టీటీడీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో భూమన కరుణాకరరెడ్డి శనివారం హైదరాబాద్‌లోని వైఎస్.విజయమ్మను తన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్ కుటుంబం మరోసారి తనకు అవకాశం కల్పించడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

– తిరుపతి మంగళం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేదురుమల్లి

18న మెగా జాబ్‌మేళా

సైదాపురం: పట్టణంలోని ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఈనెల 18న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలే కాకుండా ప్రతిఒక్క నిరుద్యోగి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జేసీఎస్ కన్వీనర్, మాజీ ఎంపీపీ మన్నారపు రవికుమార్, నేతలు కమలపూడి చంద్రారెడ్డి, గోపువరం చంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నువ్వా..నేనా?

– ముమ్మరంగా క్రికెట్ పోటీలు



103 పరుగులు చేసిన కడప జట్టు క్రీడా కారుడు గురువిష్ణు



5 వికెట్లు పడగొట్టిన కర్నూలు జట్టు క్రీడాకారుడు కళ్యాణ్

వెంకటగిరి రూరల్: ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక తారకరామ క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న సౌత్‌జోన్ అండర్–16 క్రికెట్ పోటీలు నువ్వా..నేనా? అన్నట్టు సాగుతున్నాయి. శనివారం కడప– కర్నూలు, అనంతపురం–కర్నూలు జట్ల మధ్య క్రికెట్‌పోటీలు పోటాపోటీగా సాగాయి. గ్రౌండ్–1లో కడప– కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కడప జట్టు సెకండ్ ఇన్నింగ్స్‌లో మొత్తం 87 ఓవర్లలో 314 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 18 ఓవర్ల 43 పరుగులు చేసింది. 3వ రోజు ఆట ముగిసే సమయానికి డ్రాగా ముగియగా ఫస్ట్ ఇన్నింగ్స్‌లో కడప జట్టు లీడ్‌లో ఉంది.

గ్రౌండ్–2లో..

అనంతపురం– కర్నూలు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో అనంతపురం జట్టు మూడో రోజు 67.5 ఓవర్లకు 164 పరుగులు తీసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు సెకండ్ ఇన్నింగ్స్ 29.4 ఓవర్లకు 93 పరుగులు చేసింది. నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో లీడ్‌లో ఉంది.

సప్లైచానల్‌కు నీరివ్వండి



మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, రైతులు

గూడూరు రూరల్: కండలేరు కాలువ నుంచి తిప్పగుంటపాళెం సప్లై చానల్‌కు నీరివ్వాలని రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, సర్పంచ్ సనత్‌కుమార్‌రెడ్డి, రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. నెల్లూరులోని మంత్రి నివాసంలో శనివారం మంత్రిని కలిసి విన్నవించారు. ఈ సందర్భం ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని మనుబోలు ప్రాంతం గుండా వెళుతున్న కండలేరు కాలువ నుంచి చిల్లకూరు మండలంలోని తిప్పగుంటపాళెం సప్లైచానల్ వరకు 2 మీటర్ల వెడల్పుతో కనెక్టివిటీ కల్పిస్తే దాదాపు 1,500 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. తిప్పగుంటపాళెంతోపాటు గూడూరు మండలంలోని పోటుపాళెం, పురిటిపాళెం, సప్లై చానళ్లకు పడమర వైపున ఉన్న పొలాలకు సాగునీరు అందుతుందన్నారు. అనంతరం మంత్రి స్పందిస్తూ వెంటనే నీరు విడుదల చేసేవిధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారన్నారు. మంత్రిని కలిసిన వారిలో తిప్పగుంటపాళెం సర్పంచ్ సనత్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

ఐదుగురు అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్ట్

తిరుపతి క్రైం: అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఐదుగురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను సూళ్లూరుపేట పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద శుక్రవారం సాయంత్రం ఓ గుర్తుతెలియని వాహనంలో గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. సూళ్లూరుపేట సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి తన సిబ్బందితో దాడిచేయగా వివిధ జిల్లాలకు చెందిన ఐదుగురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లు దొరికారని తెలిపారు. వీరి నుంచి పది ప్యాకెట్లు (20 కేజీల గంజాయి), ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏ–1 ముద్దాయి జలాలుద్దీన్ పై ఆంధ్రలో రెండు కేసులు, కేరళ, తమిళనాడులో కూడా కేసులు ఉన్నాయన్నారు. రెండో ముద్దాయి గోవింద్, రాజగోపాల్, రవికుమార్ నర్సీపట్నం, అనకాపల్లి మారుమూల ప్రాంతాల్లో ఆర్‌ఎంపీ డాక్టర్లుగా చెలామణి అవుతున్నారని తెలిపారు. జలాలుద్దీన్‌తో కలిసి వీళ్లంతా ముఠాగా ఏర్పడి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారని చెప్పారు. వీరందరిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రసాదాలు ఇచ్చేందుకు వచ్చి..



మృతి చెందిన రాజ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ నాగార్జునరెడ్డి

వరదయ్యపాళెం: వ్యక్తిగత పనుల నిమిత్తం తన సమీప బంధువుల ఇంటికి వచ్చి తిరిగి మోటారు బైకుపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని వరదయ్యపాళెం–సంతవేలూరు ప్రధాన రోడ్డు మార్గంలోని కళత్తూరు కూడలి వద్ద చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపిన మేరకు వివరాలు.. తడ మండలం, వేనాడుకు చెందిన రాజ (22) ఇటీవల దైవ దర్శనానికి వెళ్లి రావడంతో ప్రసాదాలు ఇచ్చేందుకు శనివారం సాయంత్రం వరదయ్యపాళెం మండలంలోని సీఎల్‌ఎన్‌పల్లిలోని చిన్నాన్న ఇంటికి వచ్చాడు. అనంతరం తన చిన్నాన్న కుమార్తె కౌసల్యను వెంట తీసుకుని ద్విచక్ర వాహనంపై వేనాడుకు తిరుగు పయనమయ్యాడు. ఈ క్రమంలో సీఎల్‌ఎన్‌పల్లి నుంచి సంతవేలూరు మీదుగా వెళ్తుండగా కళత్తూరు కూడలి వద్ద ఇటుకల లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో రాజ తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో రాజ మృతి చెందాడు. కౌసల్యకు చికిత్స చేస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నీటికుంటలో పడి మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పంచాయతీ, చెన్నయ్యగుంట రెవెన్యూ పరిధిలోని సర్వే నం .213లో గల అగ్రిగోల్డ్ ప్లాట్లలోని నీటి కుంటలో గుర్తుతెలియని వ్యక్తి పడి మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారంతో ఎస్‌ఐ జగన్నాథరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీయించారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతుని వయస్సు సుమారు 45 ఏళ్లు ఉంటాయని, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు తిరుచానూరు పోలీస్ స్టేషన్ 94407 96755, 99595 04860లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఎంత ‘మత్తు’?

- 135 అడుగుల సెల్ టవర్‌పై నిద్రించిన మందుబాబు

వాకాడు: మద్యం మత్తులో ఓ యువకుడు 135 అడుగుల ఎత్తు గల సెల్ టవర్‌పై దాదాపు 4 గంటల పాటు నిద్రించి భయభ్రాంతులకు గురిచేసిన ఘటన శనివారం మండల కేంద్రమైన వాకాడులో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. వాకాడు దళితవాడకు చెందిన పనబాక ప్రసన్న(30) మద్యం తాగి.. మైకంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న బీఎస్‌ఎన్‌ఎల్ సెల్ టవర్ చివరి భాగానికి చేరుకుని నిద్రించాడు. యువకుడిని గమనించిన స్థానికులు భయాందోళన చెంది వాకాడు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వాకాడు ఎస్‌ఐ రఘునాథ్‌తోపాటు కోట అగ్నిమాపక శాఖ అధికారులు, ఉప సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి రంగంలోకి దిగారు. పోలీసు సిబ్బంది ఇన్నమాల శ్రీహరి, చింతల దుర్గాప్రసాద్ ధైర్యం చేసి ఆ యువకుడిని బుజ్జగించి కిందటకు దించారు. గతంలో కూడా ఆ యువకుడు చాలాసార్లు మద్యం మత్తులో పెద్దపెద్ద చెట్లుపైకి ఎక్కి చివరి భాగాన నిద్రపోయినట్టు స్థానికులు చెబుతున్నారు.



యువకుడిని కిందకు దించుతున్న పోలీసు సిబ్బంది